నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, ఆదివారం 28 ఏప్రిల్ 2024 | KHAMMAM

జిల్లా పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తున్న ఎంపీ నామా, ఎమ్మెల్సీ తాతా మధు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు, మాజీ మంత్రి అజయ్

చరిత్రలో సుస్థిరం 'బీఆర్ఎస్'

- 23 ఏళ్ల క్రితం గుప్పెడు మందితో ఉద్భవం
- నేడు రాష్ట్రంలో అతి పెద్ద పార్టీగా ఆవిర్భావం
- కేసీఆర్ పోరాటం.. స్వరాష్ట్ర స్వప్నం సాకారం
- పదేళ్ల అద్భుతం.. కాపాడుకోవడమే ప్రధానం
- ఖమ్మంలో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకల్లో నేతలు
- హాజరైన నామా, వద్దిరాజు, మధు, అజయ్‌కుమార్

ఖమ్మం, ఏప్రిల్ 27: బీఆర్ఎస్ ఆవిర్భావం చరిత్రలో సుస్థిరంగా నిలిచిపోతుందని పార్టీ నేతలు పేర్కొన్నారు. 23 ఏళ్ల క్రితం గుప్పెడు మందితో ఉద్భవించిన తెలంగాణ రాష్ట్ర సమితి(టీఆర్ఎస్).. భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్)గా రూపాంతరం చెందిందని, నేడు అది తెలంగాణ రాష్ట్రంలోనే అతి పెద్ద పార్టీగా ఆవిర్భవించిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలు శనివారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నేతలు కేక్ కట్ చేసి పరస్పరం తినిపించుకొని సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన వేడుకల కార్యక్రమంలో ఖమ్మం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. చరిత్ర ఉన్నంతకాలం తెలంగాణ ఉద్యమంలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. తెలంగాణ ఉద్యమకారులను, వారి త్యాగాలను చరిత్ర ఎప్పటికీ మర్చిపోదని అన్నారు. తెలంగాణ రథసారథి కేసీఆర్ ఉద్యమాలు, ప్రజల పోరాటాలతో స్వరాష్ట్ర ఆకాంక్షను సాకారం చేసుకున్నామని అన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణను అద్భుతంగా తీర్చిదిద్దుకున్నామని గుర్తుచేశారు. ఇకపై కూడా దీనిని కాపాడుకోవడం తెలంగాణ ప్రజలకు ఎంతో ప్రధానమైన అంశమని అన్నారు. అలాగే, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక సీట్లు సాధించి చరిత్రను తిరగరాస్తుందని స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు తెలంగాణ ఎంపీగా తాను మొదటి ఓటు వేయడాన్ని తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో జిల్లాలో జరిగే పార్టీ అధినేత కేసీఆర్ బస్సు యాత్రను విజయవంతం చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో అనేక ఉద్యమాలు చేసిన చరిత్ర బీఆర్ఎస్‌కు ఉందని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి నామా నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని పార్టీ సత్తాను చాటాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 'జై తెలంగాణ' నినాదాలు చేస్తూ.. కార్యాలయంలోని ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి, తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, టీఎస్ సీడ్స్ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు ఆర్జేసీ కృష్ణ, పగడాల నాగరాజు, బిచ్చాల తిరుమలరావు, ఉప్పల వెంకటరమణ, తాజుద్దీన్, ఉద్యమ నాయకులు బొమ్మెర రామ్మూర్తి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద నివాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

కేసీఆర్ బస్సు యాత్రను సక్సెస్ చేయాలి

రోడ్ షోకు భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావాలి

మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపు

మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, ఏప్రిల్ 27 : బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 29న సాయంత్రం ఖమ్మం నగరంలో చేపట్టనున్న బస్సు యాత్రను విజయవంతం చేయాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని మమత ఆస్పత్రిలో గల తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ కార్పొరేటర్లు, ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బస్సు యాత్రకు స్వాగతం పలికేందుకు ప్రతి డివిజన్ నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చేలా కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపు కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు. గతంలో కేసీఆర్ జిల్లా అభివృద్ధికి వేల కోట్ల నిధులు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. సోమవారం సాయంత్రం మయూరి సెంటర్ నుంచి జడ్పీ సెంటర్ వరకు రోడ్ షో జరుగుతుందని, జడ్పీ సెంటర్‌లో ప్రజలనుద్దేశించి కేసీఆర్ ప్రసంగిస్తారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు జనసమీకరణపై దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, మక్బుల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణమున్నంత వరకు ప్రజల మధ్యే ఉంటా

నా ఆరాటం.. పోరాటం ఖమ్మం ప్రజల గురించే..

మళ్లీ గెలిపించండి.. మీ గొంతుకనవుతా..

బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ మంత్రి అజయ్‌కుమార్ తదితరులు

ఖమ్మం, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఖమ్మం జిల్లా రైతుబిడ్డను నేను.. ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగాను.. జిల్లా ప్రజలతోనే నిత్యం కలిసిమెలిసి ఉన్నాను.. నా గొంతులో ప్రాణం ఉన్నంత కాలం ప్రజల మధ్యలోనే ఉంటా.. ఈ ఎన్నికల్లో మీ ఆశీర్వాదంతో మళ్లీ పార్లమెంట్‌కు వెళ్లి ప్రజాసమస్యలపై కోట్లాడి మరింత అభివృద్ధికి కృషి చేస్తానని బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నామా మాట్లాడారు. గత రెండు ఎన్నికల్లో మంచి మెజార్టీతో గెలిపించి పార్లమెంటుకు పంపితే పార్లమెంట్‌లో తెలంగాణ గొంతుకనై విభజన హామీలు, ప్రాజెక్టులు, నిధులు, అనేక సమస్యలపైన గళాన్ని వినిపించి సాధించానని చెప్పారు. తన జీవితం తెరిచిన పుస్తకం అని, ఎప్పుడూ 24 గంటలు తమ ఇంటి తలుపులు ప్రజల కోసం తెరిచే ఉంటాయన్నారు. పార్టీలకతీతంగా ప్రజాసేవ చేస్తున్నానని తెలిపారు. ఎవరు ఏ పని మీద ఆఫీసుకు వచ్చినా, ఢిల్లీ వచ్చినా అందర్నీ కలుపుకొని వారికి అండగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడికి వెళ్లినా జిల్లా ప్రజల గురించే ఆలోచన చేసుకుంటానని అన్నారు. ఆ రెండు పార్టీల ఎంపీలు ఏనాడూ తెలంగాణ గురించి, జిల్లా ప్రజల సమస్యల గురించి పార్లమెంట్‌లో మాట్లాడలేదని అన్నారు. తన తల్లిది తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణి గ్రామమని, 10వ తరగతి వరకు పాల్వంచ, ఇంటర్ కొత్తగూడెంలో చదివానని నామా గుర్తుచేశారు. ఇక్కడి ప్రజలతో రాజకీయాల్లోకి రాకముందు నుంచే అనుబంధం ఉందని, సంపాదించిన దానిలో తన కన్నబిడ్డలకు పెట్టుకున్నట్లే జిల్లా ప్రజలకు కూడా పెట్టుకున్నానని చెప్పారు. ప్రజాసేవలోనే ముందుకు సాగుతున్నానని, మళ్లీ ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపాలని కోరారు. తండ్రి నామా ముత్తయ్య ట్రస్టు ద్వారా పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు చేసిన సంగతి తెలిసిందేనని అన్నారు. తెలంగాణ గొంతుక పార్లమెంట్‌లో వినిపించాలంటే బీఆర్ఎస్ ఎంపీలు చేయవలసిన బాధ్యత అందరిపైనా ఉందని నామా చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ జిల్లా ఎల్లలు, జిల్లా నైసర్గిక స్వరూపం, జిల్లా సమస్యలు తెలియనటువంటి వ్యక్తులు పోటీలో ఉన్నారని అన్నారు. నామాను గెలిపిస్తే జిల్లా మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా ఖమ్మంజిల్లా ప్రజలతో అవినాభావ సంబంధం కలిగి ఉన్న నామాను గెలిపించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఆయన గెలుపు ద్వారా మరింత అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ఈ నెల 29, 30 తేదీల్లో జరిగే కేసీఆర్ బస్సుయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ 60ఏళ్లపాటు ప్రజల్ని గోస పెట్టిన కాంగ్రెస్‌ను తరమాలని అన్నారు. అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వందరోజుల్లోనే ప్రజల విశ్వాసం కోల్పోయిందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, నాయకులు ఉప్పల వెంకటరమణ, బెల్లం వేణుగోపాల్, పగడాల నరేందర్, బొమ్మెర రామ్మూర్తి, డోకుపర్తి సుబ్బారావు పాల్గొన్నారు.

పోరాట యోధుడు కేసీఆర్

బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మెచ్చా

తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న మెచ్చా

అశ్వారావుపేట టౌన్, ఏప్రిల్ 27 : రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు కేసీఆర్ అని, ముఖ్యమంత్రిగా పదేళ్లు తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించారని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ 23వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను స్థానిక రింగ్ రోడ్డు సెంటర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. స్వరాష్ట్ర సాధనలో అసువులు బాసిన అమరులకు నివాళులర్పించారు. అనంతరం మెచ్చా మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో నీళ్లు, నిధులు, నియామకాల కోసం అలుపెరుగని కృషి చేసిన వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన ఉద్యమకారులను బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ మరిచిపోదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి యూఎస్ ప్రకాశ్, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, వైస్ ఎంపీపీ చిట్టూరి ఫణీంద్ర, సత్యవరపు సంపూర్ణ, మహిళా నాయకురాలు వగ్గెల పూజ, నాయకులు మందపాటి రాజమోహన్‌రెడ్డి, తాడేపల్లి రవి, సంకా ప్రసాద్, మాజీ జడ్పీటీసీ అంకత మల్లికార్జునరావు, కాసాని చంద్రమోహన్, వెంకటేశ్వరావు, రమేశ్, రఘురామ్, బజారయ్య, రాజశేఖర్, శ్రీను, మోహన్, హరి, చరణ్, దుర్గయ్య, వెంకటేశ్వరావు, నాగరాజు, వెంకన్న, రాము, జాకబ్, సూరి, చరణ్ పాల్గొన్నారు.

నామా గెలుపునకు సైనికుల్లా పని చేయాలి

ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

కేక్ కట్ చేస్తున్న జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

ఎర్రుపాలెం, ఏప్రిల్ 27: ఖమ్మం ఎంపీగా నామా నాగేశ్వరరావు గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని, ఆయనకు అత్యధిక మెజార్టీ తీసుకురావాలని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు ఆధ్వర్యంలో శనివారం ఎర్రుపాలెం మండల బూత్‌స్థాయి సమావేశం జరిగింది. తొలుత పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం కమల్‌రాజు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు బూత్ స్థాయిలో కష్టపడి పని చేయాలన్నారు. పార్టీ బలోపేతానికి అందరూ సమష్టిగా పని చేయాలన్నారు. అనంతరం ఇటీవల మృతిచెందిన బీఆర్ఎస్ నాయకులు దేవరకొండ ప్రభాకర్‌రావు, కృష్ణారెడ్డిల ఇళ్లకు వెళ్లి వారి చిత్రపటానికి పూలమాలలు వేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మధిర మార్కెట్ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, జడ్పీటీసీ శీలం కవిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు, నాయకులు యన్నం శ్రీనివాసరెడ్డి, కే.సాంబశివరావు, రామకోటయ్య, పులి శిరీష, తిరుపతిరావు, పుల్లారెడ్డి, సత్యనారాయణరెడ్డి, కిశోర్, భాస్కర్, పవన్, వెంకటేశ్వరరావు, కృష్ణారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, కృష్ణారావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

ఎన్నికల సాధారణ పరిశీలకుడు సంజయ్ జి కోల్టే

మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు సంజయ్ జి కోల్టే

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకుడు డాక్టర్ సంజయ్ జి కోల్టే అన్నారు. శనివారం ఐడీవోసీ సమావేశ మందిరంలో పోలీస్ పరిశీలకులు చరణ్‌జిత్ సింగ్, వ్యయ పరిశీలకులు శంకర్ ఆనంద్ మిశ్రా, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్, భద్రాద్రి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ రోహిత్ రాజులతో కలిసి సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి నిర్ణీత సమయంలో పనులన్నీ పూర్తి చేయాలన్నారు. పనుల నిర్వహణకు ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పని చేయాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్‌కు 72 గంటల ముందు ఎంసీసీ బృందాలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ సిబ్బందికి ఇచ్చే శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉండాలని, దీనిని సద్వినియోగం చేసుకొని విధుల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో ఓటరు టర్నోవర్ పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు పరిశీలకుడు చరణ్‌జిత్ సింగ్ మాట్లాడుతూ నిఘా వ్యవస్థ పకడ్బందీగా ఉండాలని, సీజర్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, లోకల్ పోలీసులు తనిఖీలు మరింత పకడ్బందీగా చేయాలన్నారు. వ్యయ పరిశీలకుడు శంకర్ ఆనంద్ మిశ్రా మాట్లాడుతూ అభ్యర్థుల వ్యయ పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, సీజర్‌ల విషయంలో నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రెండు అసెంబ్లీ సెగ్మెంట్లు(కొత్తగూడెం, అశ్వారావుపేట) మన జిల్లాలో ఉన్నట్లు తెలిపారు. వాటికి సహాయ రిటర్నింగ్ అధికారులుగా కొత్తగూడెం ఆర్డీవో, అదనపు కలెక్టర్(రెవెన్యూ) ఉన్నారన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మ్యాన్‌పవర్, ఎంసీసీ, బందోబస్తు, శిక్షణ, ఎక్సైజ్, ఏఎంఎఫ్, రవాణా, వ్యయ పర్యవేక్షణ, కంట్రోల్ రూమ్, సువిధ అనుమతులు, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై వివరించారు. సమీక్షలో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, నోడల్ ఆఫీసర్లు, ఎన్నికల సూపరింటెండెంట్లు దారా ప్రసాద్, రంగా ప్రసాద్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.42.86 లక్షల నగదు పట్టివేత

ఖమ్మం వ్యవసాయం, ఏప్రిల్ 27: ఖమ్మం రూరల్ మండలంలోని వెంకటగిరి క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు శనివారం తనిఖీలు చేస్తుండగా నగదు పట్టుబడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎలాంటి పత్రాలు, బిల్లులు లేకుండా ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న రూ.42,86,290 నగదును స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఆదాయపు పన్ను శాఖ అధికారులకు సమాచారం అందజేశామని సీపీ సునీల్‌దత్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్‌కు చెందిన వ్యక్తి మిర్యాలగూడ నుంచి మణుగూరుకు ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తీసుకవెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

శ్రీరామ నామ చాంటింగ్ ప్రారంభం

భద్రాచలం, ఏప్రిల్ 27: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో రామ నామం కోసం దాతల సహకారంతో 2.40లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన శ్రీరామ నామ చాంటింగ్‌ను దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి శనివారం ప్రారంభించారు. శ్రీరామ నామాన్ని ఆలయంలో ప్రతి నిత్యం వినిపించేందుకు దేవస్థాన అధికారులు చర్యలు తీసుకున్నారు. భద్రాచలం పట్టణానికి చెందిన అనుమోలు సత్యనారాయణ రూ. 1.10లక్షలు, గార్లకు చెందిన ఎం మాలతి రూ.1.30లక్షలు అందజేసి శ్రీరామ నామ చాంటింగ్ ఏర్పాటుకు అందించారు.

విప్పపువ్వు.. ఆదివాసీల కల్పతరువు

- ఏటా ఏప్రిల్, మే నెలల్లో ఏజెన్సీ అడవుల్లో విస్తారంగా సేకరణ
- సహజసిద్ధ ఔషధ గుణం.. సంపూర్ణ ఆరోగ్యానికి వినియోగం
- జీసీసీ కేంద్రాల్లో విక్రయం.. సీజన్‌లో ఇంటిల్లిపాదికీ ఆదాయం
- శ్రీరామచంద్రుడికీ ప్రీతిపాత్రం.. ఆలయ పూజల్లో నైవేద్యం

సేకరించిన విప్పపూలను గ్రామంలోని ఇంటి ఆవరణలో ఎండబెట్టిన ఆదివాసీలు

కరకగూడెం, ఏప్రిల్ 27: ఏజెన్సీలోని దట్టమైన మన్యంలో లభించే విప్పపూలు ఆదివాసీలకు కల్పతరువు లాంటివి. వీటిలోని సహజసిద్ధ ఔషధ గుణాలు.. ప్రతి ఒక్కరి సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. దీంతో చాలామంది దీని ఉత్పత్తులను విరివిగా వినియోగిస్తారు. అయితే ఇందుకోసం జరిగే విప్పపూల సేకరణ ఆదివాసీలకు చక్కని ఆదాయాన్ని సమకూర్చుతుంది. ఏటా ఏప్రిల్, మే నెలల్లో ఏజెన్సీ అడవుల్లో విప్పపూలు విస్తారంగా పూస్తాయి. దీంతో ఆయా నెలల్లో ఆదివాసీలు ఇంటిల్లిపాదీ కలిసి అడవుల్లోకి వెళ్లి వాటిని సేకరించుకొని తెస్తారు. తగిన మోతాదులో ఎండబెట్టిన తరువాత వాటిని జీసీసీ కేంద్రాల్లో విక్రయించి మంచి ఆదాయం పొందుతారు. కరకగూడెం మండలం రఘునాథపాలెం, చొప్పాల, కొత్తగూడెం, రేగళ్ల, ముత్తారం, కన్నాయిగూడెం, కోరంవారిగుం పు, చిరుమళ్ల, అనంతారం, శ్రీరంగాపురం, మొగిలితోగు తోపాటు మరికొన్ని గ్రామాల్లో విప్పపూల సేకరణ ఇప్పటికే ప్రారంభమైంది.

విప్పపూలతో సంపూర్ణ ఆరోగ్యం

సంపూర్ణ ఆరోగ్యానికి విప్పపూలు ఎంతో మేలు చేస్తాయని ఆయుర్వేద వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎండిన విప్పపూలను వెచ్చగా చేసి నూనె తయారు చేసి తల వెంట్రుకల కుదుళ్లకు పట్టిస్తే చుండ్రు సమస్యే ఉండదని చెబుతున్నారు. అలాగే విప్పపూల బెరడును మెత్తగా దంచి దాని నుంచి రసం తీసి 5 మి.లీ చొప్పున తాగితే వాతం, నొప్పులు, రక్తహీనత వంటివి తగ్గిపోతాయని అంటున్నారు. అలాగే చిన్నపిల్లల చేతుల మీద తరుచూ వచ్చే దద్దుర్లను చిటికెలో తగ్గించే గుణం ఈ విప్పపూల నూనెలో ఉంటుందని చెబుతున్నారు. ముఖ్యంగా స్త్రీలకు సంబంధించి గర్భస్రావ సమస్యలు, హైడ్రోఫోబియా వంటి వాటికి కూడా విప్ప కషాయం చక్కని ఔషధంగా పనిచేస్తుందంటున్నారు. విప్పకాయలను నూరి లేపనంగా మర్దనా చేస్తే శరీరంపై ఉండే కురుపులు మానిపోతాయని, విప్ప బెరడును నములుతూ ఉంటే పంటి చిగుళ్ల పటుత్వం పెరుగుతుందని, పంటి నొప్పులు పూర్తిగా తగ్గిపోతాయని, గుట్కా, జర్దా లాంటివి నమిలే వారికి ఇది ఎంతో మేలు చేస్తుందని వివరిస్తున్నారు. చెవిలో ఇన్‌ఫెక్షన్‌తో బాధపడేవారికి విప్పనూనె ఎంతగానో ఉపకరిస్తుందని చెబుతున్నారు.

శ్రీరాముడికి ప్రీతిపాత్రం

శ్రీసీతారామచంద్రస్వామికి విప్పపువ్వు ఎంతో ప్రీతిపాత్రమైనదని ప్రతీతి. ఇందుకు అనుగుణంగా శ్రీసీతారాముల ఆలయాల వద్ద విప్పపువ్వు ప్రసాదాన్ని శ్రీరాముడి పూజకు ఉపయోగిస్తారు. ముఖ్యంగా భద్రాచలం ఆలయ ప్రాంగణంలోని ప్రతి దుకాణంలోనూ విప్పపువ్వు ప్రసాదం లభిస్తుంది. భక్తులు దీనిని కొనుగోలు చేసి శ్రీరాముడి పూజలో నైవేద్యంగా వినియోగిస్తారు.

జీసీసీ కేంద్రాల ద్వారా కొనుగోలు

గిరిజనులు సేకరించే అటవీ ఉత్పత్తులను జీసీసీ కేంద్రాలు ప్రభుత్వం ప్రకటించిన ధరకు కొనుగోలు చేస్తుంటాయి. కరకగూడెం మండలంలోని గిరిజనులు తాము సేకరించిన విప్పపూలను ఎండబెడతారు. నిర్ణీత సమయానికి ఎండిన తరువాత జీసీసీ డీలర్లు వీటిని కొనుగోలు చేస్తారు. ఆదివాసీలకు మంచి ధరను అందిస్తారు. ఈ ఏడాది కూడా విప్పపూల సేరకణ రికార్డు స్థాయిలో జరుగుతుందని, మంచి ధర లభిస్తుందని జీసీసీ అధికారులు అంచనా వేస్తున్నారు.

విప్పపూల సేకరణతో ఇంటిల్లిపాదికీ ఉపాధి

ప్రకృతిలో లభించే విప్పపూల సేకరణతో రెండు నెలలపాటు మా ఇంటిల్లిపాదికీ ఉపాధి లభిస్తుంది. మా ఇంట్లోని కుటుంబ సభ్యులమంతా రోజూ ఉదయాన్నే లేచి విప్పపూల సేకరణకు వెళ్తాం. పూలను నిండుగా సేకరించుకొని ఇంటికి తిరిగి వస్తాం. ఇంటి వద్ద 5, 6 రోజులపాటు ఎండబెడతాం. వాటిని తీసుకెళ్లి జీసీసీ కేంద్రాల్లో విక్రయిస్తాం. ఔషధ గుణాలున్న విప్పపూలకు మంచి ధర పలుకుతుంది. మాకు సంతృప్తికర ఆదాయం సమకూరుతుంది.

–కొమరం పుష్పలత, అల్లేరుగూడెం, కరకగూడెం మండలం

సీజన్‌లో అధిక ఆదాయం

విప్పపూల ఉత్పత్తులకు మంచి ఆదరణ ఉండడంతో మార్కెట్‌లో వీటికి డిమాండ్ అధికంగా ఉంటుంది. దీంతో ఏటా సీజన్‌లో మేం విప్పపూలను అధికంగా సేకరిస్తాం. జీసీసీ కేంద్రాల్లో విక్రయించి అధిక ఆదాయం పొందుతాం. అయితే, సేకరించిన మొత్తం విప్పపూలన్నింటినీ మేము విక్రయించం. కొన్ని పూలను మేం మా ఇళ్లలో నిల్వ చేసుకుంటాం. వివాహాలు, ఇతర కార్యాల సమయాల్లో వీటితో సారా కాచి మా బంధువులకు పోస్తాం. విప్ప సారా ఆరోగ్యానికి మేలు చేస్తుందని మా పూర్వీకులు చెప్పారు.

–రఘుపతి, గొల్లగూడెం, కరకగూడెం మండలం